AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
27-10-2025 (Monday)
MAIN EDITION

## ఐపీవోకు లెన్స్‌కార్ట్




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** కళ్లజోళ్ల తయారీ, మార్కెటింగ్‌లో తనదైన ముద్ర వేసిన లెన్స్‌కార్ట్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. మార్కెట్ నుంచి రూ. 7,278 కోట్లు సమీకరించనుంది. దేశంలోనే ఇది మొదటి ప్రత్యేక ఐవేర్ ఐపీవో. లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఐపీవో ద్వారా రూ. 7,278.02 కోట్లను సమీకరించనుంది. ఇందులో రూ. 2,150 కోట్లు ఫ్రెష్ ఇష్యూ కాగా.. మిగిలినది ఆఫర్ ఫర్ సేల్. కంపెనీ రూ. 2 ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరు ధరను రూ. 382 నుంచి రూ. 402 గా నిర్ణయించింది. ఐపీవో సబ్‌స్క్రిప్షన్ ఈనెల 31న ప్రారంభమవుతుంది. వచ్చేనెల 4న ముగుస్తుంది. 7న బీఎన్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టవనుంది.

## ఐసీయూలో శ్రేయస్ అయ్యర్..



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** టీమిండియా బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఆసీస్‌తో జరిగిన మూడో వన్డేలో క్యాచ్ పట్టిన సమయంలో ఆయన గాయపడిన విషయం తెలిసిందే. దీంతో అతడి ప్లీహానికి తీవ్ర గాయమవడంతో నొప్పితో విలవిలలాడాడు. ఆయనను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రెండు నుంచి ఏడు రోజులు అయ్యర్ వైద్యుల పర్యవేక్షణలో ఉంటాడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించాయి.

## కొనసాగుతున్న ఆర్టీఏ తనిఖీలు



**అక్షరటుడే, హైదరాబాద్:** కర్నూల్ బస్సు ప్రమాదం ఘటనతో అప్రమత్తమైన ఆర్టీఏ అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేస్తున్నారు. నిబంధనలు పాటించని బస్సులపై చర్యలు తీసుకుంటున్నారు. వనస్థలిపురంలో, అధికారులు సోమవారం పలు బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన తొమ్మిది బస్సులపై కేసు నమోదు చేశారు.

## పత్తిని ఆరబెట్టి తీసుకురావాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** పత్తి రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు సూచనలు చేశారు. మార్కెట్ యార్డులకు, జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకువచ్చే ముందు 12 శాతంలోపు తేమ ఉండేవిధంగా చూడాలన్నారు. ఆ మేరకు ఆరబెట్టి పత్తిని తీసుకు రావాలని సూచించారు. లేదంటే మద్దతు ధర రాదని ఆయన చెప్పారు.

## ఏపీలో 43 రైళ్లు రద్దు



**అక్షరటుడే, విశాఖ:** మొంథా తుపాన్ దూసుకు వస్తోంది. దీని ప్రభావంతో ఏపీలోని తీర ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. దీంతో రైల్వే శాఖ అప్రమత్తమైంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా 43 రైళ్ల సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రకటించింది. అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పలు రైళ్లను రద్దు చేసినట్లు తెలిపింది.

## కొత్త చీఫ్ జస్టిస్‌గా సూర్యకాంత్..!



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా సూర్యకాంత్ నియామకం కానున్నారు. ప్రస్తుతం సీజేఐ బీఆర్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ పేరును ఆయన ప్రతిపాదించారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖకు సిఫారసు చేశారుసీనియారిటీతో పాటు, అధికారం చేపట్టడానికి అన్ని అంశాలలో సూర్యకాంత్ తగినవాడని పేర్కొన్నారు. హర్యానాకు చెందిన సూర్యకాంత్ 2019 మే 24న సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు.

## అమెరికాలో విమాన సర్వీసులకు అంతరాయం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో ప్రభుత్వం షట్‌డౌన్ కొనసాగుతోంది. దీంతో ఆ దేశంలో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమెరికాలో రెండు బిల్లులకు ఆమోదం లభించకపోవడంతో ప్రభుత్వం షట్‌డౌన్ అయిన విషయం తెలిసిందే. అమెరికా తర్వాతి ఆర్థిక సంవత్సరానికి అవసరమైన నిధుల బిల్లులను సెనెట్ ఆమోదించలేదు. దీంతో అక్టోబర్ 1 నుంచి షట్‌డౌన్ కొనసాగుతోంది. దీని ప్రభావంతో అగ్రరాజ్యంలో ఆదివారం దాదాపు 8 వేల విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. 22 చోట్ల ఎయిర్ ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించేందుకు ప్రధాన పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఎలాగైనా జెండా ఎగురువేయాలనే లక్ష్యంతో ప్రచారంలో దూసుకు పోతున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ హోరాహోరీగా పోరాడుతుండగా, బీజేపీ వెనుకబడినట్లు కనిపిస్తోంది. కాషాయ నాయకత్వ వ్యవహార శైలి అనేక అనుమానాలకు తావిస్తోంది. అభ్యర్థి ఎంపిక మొదలు ప్రచార తీరు వరకూ సొంత పార్టీ కేడర్‌లోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్య నాయకత్వం ఎందుకిలా వ్యవహరిస్తుందో తెలియక సతమతమవుతోంది. బీజేపీ శ్రేణుల్లో నెలకొన్న గందరగోళాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు ఎత్తి చూపుతున్నాయి.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

# కాషాయం.. అయోమయం!




- **జూబ్లీహిల్స్ ఎన్నికపై కరువైన సీరియస్ ఎఫర్ట్**
- **ప్రచారంలో కనిపించని ముఖ్య నేతలు..**
- **దూరంగా ఉంటున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు**
- **బీజేపీ కేడర్‌లో గందరగోళం**

భారతీయ జనతా పార్టీలో మునుపటి జోష్ కరువైంది. గెలవాలనే కసి ఉన్నట్లు కనిపించడం లేదు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తెలంగాణలో ఊహించని రీతిలో బీజేపీ బలపడింది. ప్రజా సమస్యలతో పాటు ఉప ఎన్నికల సమయంలోనూ కాషాయ పార్టీ దూసుకెళ్లింది. బీజేపీ దూకుడు బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలో పడేశాయి. అలాగే.. హైదరాబాద్, నిజామాబాద్ వంటి మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో భారీగా సీట్లు సాధించి సత్తా చాటింది. ఈ క్రమంలో రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్న భావన అంతటా ఏర్పడింది. అయితే, మారిన రాజకీయ పరిస్థితుల్లో కిషన్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిన పార్టీ ఎన్నికల్లో అనూహ్యంగా దూకుడు తగ్గించింది. కేవలం 8 సీట్లకే పరిమితమైంది. పార్లమెంట్ ఎన్నికల్లో 8 ఎంపీ సీట్లు కైవసం చేసుకుంది. అయితే.. ప్రధాని మోదీ మీద అభిమానంతో ప్రజలు బీజేపీకి ఓట్లేశారు తప్పితే రాష్ట్రంలో బీజేపీ ఏదో చేస్తుందని కాదు. ఈ విజయం వెనుక రాష్ట్ర నాయకత్వం పాత్ర పరిమితమే.

బీజేపీ రాష్ట్రంలో బలపడేందుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రూపంలో మరోసారి అవకాశం వచ్చింది. కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ ఉప సమరంలో విజయం సాధించడం ఎంతో ప్రధానం. కానీ, అలాంటి గోల్డెన్ ఛాన్స్‌ను బీజేపీ చేజేతులా చేజార్చుకున్నట్లు కనిపిస్తోంది. ఉప ఎన్నిక అనివార్యమని తేలడంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నాయి. అభ్యర్థుల ఖరారు నుంచి ప్రచారం వరకూ ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాయి. కానీ బీజేపీలో మాత్రం ఆ స్థాయిలో సన్నద్ధత కనిపించడం లేదు. చివరి నిమిషం దాకా అభ్యర్థిని ఖరారు చేయలేదు. చివరకు లెంకల దీపక్‌రెడ్డిని బరిలోకి దింపిన కాషాయ దళం.. ప్రచారాన్ని హోరెత్తించడంలో వెనుకబడింది. ముఖ్య నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇలాకలో జరుగుతున్న బైపోల్‌లో గెలుపు కోసం అందరినీ సమన్వయంలో రాష్ట్ర నాయకత్వం విఫలమైనట్లే కనిపిస్తోంది. కిషన్‌రెడ్డి కూడా పెద్దగా చొరవ చూపించడం లేదని కేడర్‌లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### వ్యూహాత్మక వైఫల్యం..

కాంగ్రెస్ వైఫల్యాలు.. బలహీనపడిన బీఆర్ఎస్.. ఈ తరుణంలో రాష్ట్రంలో సొంతంగా ఎదుగేందుకు అవకాశమున్న ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీ వ్యవహార శైలి అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే బీజేపీ మీద అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మరోవైపు, రెండు జాతీయ పార్టీలు సిద్ధాంతాలను పక్కనపెట్టి సహకరించుకుంటున్నాయని గులాబీ పార్టీ ఆరోపిస్తోంది. ఈ తరుణంలో ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టడంలో బీజేపీ విఫలమవు తోంది. మరోవైపు, ముఖ్య నాయకుల వ్యవహార శైలితో కేడర్‌లో గందరగోళం నెలకొంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. అభ్యర్థి ఎంపిక వి షయంలో ముఖ్యనేతల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోలేదన్న ప్రచారం జరిగింది. ఓవైపు బీఆర్ఎస్ తన స్థానాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తుంటే, మరోవైపు, కాంగ్రెస్ జూబ్లీహిల్స్‌లో పాగా వేసేందుకు పోరాడుతుంటే.. బీజేపీ ఆ స్థాయిలో పనిచేయకపోవడం చర్చనీయాంశమైంది.

## వీధి కుక్కల కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలో వీధి కుక్కల దాడులు పెరుగుతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కుక్కల బెడదతో విదేశాల్లో భారత్‌ను చెడుగా చిత్రీకరిస్తున్నారని కోర్టు వ్యాఖ్యానించింది. వీధి కుక్కల బెడదపై సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ విచారణలో ఉంది. ఇందులో భాగంగా సోమవారం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల బెడద నియంత్రణకు తాము ఆదేశాలు ఇచ్చినా.. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంపై సుప్రీంకోర్టు మండిపడింది. కుక్కల దాడులు పెరుగుతున్నాయని న్యాయస్థానం ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి ఘటనలతో విదేశాల్లో భారత్‌ను చెడుగా చిత్రీకరిస్తున్నారని పేర్కొంది.

## బ్రిటన్‌లో భారత యువతిపై అత్యాచారం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బ్రిటన్‌లో దారుణం చోటు చేసుకుంది. భారతీయ యువతిపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. యూకేలోని వెస్ట్ మిడ్ల్యాండ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. లండన్ కాలమానం ప్రకారం.. శనివారం సాయంత్రం ఈ ఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వాల్సల్ ప్రాంతంలో ఓ యువతిపై అఘాయిత్యం జరిగినట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించారు. బాధిత యువతిని ఆస్పత్రికి తరలించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించారు. కాగా.. బాధితురాలు పంజాబీ యువతి అని సిక్కు ఫెడరేషన్ యూకే తెలిపింది. యూకేలో వరుస ఘటనలతో ప్రవాస భారతీయులు ఆందోళన చెందుతున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి





**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** కాంగ్రెస్ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. డ్రైవర్ల సమస్యలు తెలుసుకోవడానికి సోమవారం ఆయన ఆటోలో ప్రయాణించారు. ఎర్రగడ్డలో ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆటో డ్రైవర్ల జీవితాలు మరింత దిగజారాయని హరీశ్‌రావు అన్నారు. 161 మంది డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్లుగా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు రెండేళ్లకు సంబంధించిన రూ.24 వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఏసీబీకి చిక్కిన గ్రామ పరిపాలన అధికారి

**అక్షరటుడే, భద్రాద్రి కొత్తగూడెం :** మరో అవినీతి అధికారి ఏసీబీకి చిక్కాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామపరిపాలన అధికారి లంచం తీసుకుంటూ దొరికిపోయాడు. జీపీవో బానోత్ శ్రీనివాస్ నాయక్ పూసుగూడెంకు చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం మొత్తం రూ. 60 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఇప్పటికే రూ.40 వేలు చెల్లించాడు. అనంతరం ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా.. గ్రామ పరిపాలన అధికారి శ్రీనివాస్ నాయక్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలోని అధికారులు కార్యాలయంలో సోదాలు చేపట్టారు.

## వణికిస్తున్న మొంథా తుపాన్..



**అక్షరటుడే, అమరావతి:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం బలపడి తుపాన్‌గా మారింది. మొంథా తుపాన్ ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో తుపాన్ కేంద్రీకృతమై ఉంది. మంగళవారం ఉదయానికి తీవ్ర తుపాన్‌గా మారి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తుపాన్ ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి నుంచి తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాత్రి సమయంలో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి. మొంథా తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాలపై అధికంగా ఉండనుంది. దీంతో అక్కడి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. అధికారులకు సెలవులు రద్దు చేసింది. సహాయక చర్యల కోసం రూ.19 కోట్లు విడుదల చేసింది. తీర ప్రాంత మండలాల్లో సహాయక శిబిరాలను సిద్ధం చేసింది.

## డీప్ ఫేక్ బారిన మెగాస్టార్..



**అక్షరటుడే, సినిమా డెస్క్:** డీప్‌ఫేక్ టెక్నాలజీ ఇప్పుడు సెలబ్రిటీలకు పెద్ద తలనొప్పిగా మారింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంగా రూపుదిద్దుకున్న ఈ టెక్నాలజీని కొందరు చెడు ఉద్దేశాలతో వాడుతూ, ప్రముఖుల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా మార్ఫ్ చేసిన వీడియోలను సృష్టిస్తున్నారు. ఇప్పటికే బాలీవుడ్ హీరోయిన్లు కాజోల్, కత్రినా కైఫ్, రష్మిక మందన్న వంటి ప్రముఖులు డీప్‌ఫేక్ వీడియోల బారిన పడ్డారు. తాజాగా టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి కూడా ఈ జాబితాలో చేరారు. కొందరు దుండగులు చిరంజీవి ఫొటోలను మార్ఫ్ చేసి అశ్లీల వీడియోలుగా తయారు చేసి, వాటిని సోషల్ మీడియాలో మరియు వెబ్‌సైట్లలో పోస్ట్ చేశారు. ఆ వీడియోలు కొద్ది గంటల్లోనే వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై తీవ్రంగా ఆగ్రహించిన మెగాస్టార్ వెంటనే హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు.

## ఎట్టకేలకు పెళ్లిపై స్పందించిన శ్రీలీల..



**టాలీవుడ్ బ్యూటీ శ్రీలీల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తక్కువ కాలంలోనే ఈ భామ స్టార్ హీరోల సరసన వరుస సినిమా అవకాశాలు అందుకొని టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా ఎదిగింది. ఈ అమ్మడు తాజాగా.. ఓ ఇంటర్వ్యూలో తన పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచింది. తనకు కాబోయే భర్త ఎలా ఉండాలన్న ప్రశ్నకు శ్రీలీల స్పందిస్తూ.. "అతను అందంగా ఉండకపోయినా పర్వాలేదు. కానీ నన్ను అర్థం చేసుకునే వ్యక్తి అయి ఉండాలి. నా కెరీర్‌కు మద్దతుగా ఉండడంతో పాటు, నన్ను మంచిగా చూసుకోవాలి. నా పట్ల నిజాయితీగా ఉండి, సరదాగా, పాజిటివ్‌గా ఉండే వ్యక్తి కావాలి. అలాంటి వాడిని కలిస్తే తప్పకుండా పెళ్లి చేసుకుంటాను" అని ఓపెన్‌గా చెప్పింది. శ్రీలీల ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.**

**–అక్షరటుడే, సినిమాడెస్క్**